జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



# కూటమిలో కార్గిల్.. మంటలు!





* సుడా చైర్మన్‌కు అవమానంతో జనసైనికుల ఆగ్రహం * రెండు కోట్ల సుడా నిధులతో పార్కు నిర్మాణం * చైర్మన్ లేకుండా ప్రారంభోత్సవంపై విమర్శలు * ప్రోటోకాల్ గాలికి.. పక్కనపెట్టిన అధికారులు, మిత్రపక్షం * పనులు పూర్తికాకముందే 'విక్టరీ' పార్కు ప్రారంభం * జనసేన నేతలను తక్కువ చేస్తున్నారంటూ ఆపార్టీ నేతల నుంచి విమర్శలు

శ్రీకాకుళం, మార్చి 22 (వార్త): జిల్లా కేంద్రంలోని ఏపీహెచ్‌బీ కాలనీలో నిర్మించిన 'కార్గిల్ విక్టరీ పార్కు' ప్రారంభోత్సవం .. కూటమి నేతల్లో చిచ్చు రేపింది. సుమారు రూ.2 కోట్ల 'సుడా' నిధులతో, ఆ సంస్థ చైర్మన్ కొరికాన రవికుమార్ పట్టుబట్టి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఈ ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో ఆయనకే చోటు లేకపోవడం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సంస్థకు అధిపతిగా ఉన్న వ్యక్తి విదేశీ పర్యటనలో ఉన్నారని తెలిసి కూడా, పనులు పూర్తికాకముందే హడావుడిగా ప్రారంభించడం వెనుక ఆంతర్యమేమిటని జనసేన శ్రేణులు నిలదీస్తున్నాయి.


## ప్రోటోకాల్‌కు పాతర..

## అవమాన భారంలో 'జనసేన'

ప్రాజెక్టుకు అత్యంత కీలకమైన చైర్మన్‌ను కాదని అధికారులు వ్యవహరించిన తీరు వివాదాస్పదంగా మారింది. మరో 10 రోజులు పనులు ఉన్నాయని, అప్పటి వరకు ప్రారంభోత్సవం వద్దని రవికుమార్ అధికారులకు, సుడా వైస్ చైర్మన్ (జేసీ)కి స్పష్టంగా సూచించారు. అయినప్పటికీ జిల్లా అధికారులు పెడచెవిన పెట్టారన్న గుసగుసలు ఉన్నాయి. చైర్మన్ మలేషియాలో ఉన్న సమయంలో, కేవలం ఒక రోజు ముందు సమాచారం ఇచ్చి కార్యక్రమం కానిచ్చేశారు. ఇది కేవలం వ్యక్తిగత అవమానం కాదని, జనసేనాని పవన్ కళ్యాణ్‌కు, ఆ పార్టీ గౌరవానికి జరిగిన భంగమని జనసైనికులు సోషల్ మీడియాలో విరుచుకుపడుతున్నారు. 2024 ఎన్నికల్లో కూటమి గెలుపునకు రక్తం ధారపోసిన తమను, నేడు అధికారంలోకి వచ్చాక కనీసం గుర్తించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## శిలాఫలకాల రీ-డిజైన్..

అధికారులు రూపొందించిన శిలాఫలకం డిజైన్‌ను సైతం మార్చి, టీడీపీ నేతలు తమకు అనుకూలంగా రీ-డిజైన్ చేయించుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జనసేనతో పాటు బీజేపీని కూడా జిల్లాలో పక్కన పెట్టేస్తున్నారని, అసలు కూటమి ఎందుకు కట్టామా అనే వేదన కిందిస్థాయి కార్యకర్తల్లో కనిపిస్తోంది. "చైర్మన్ లేకుండా సుడా నిధులతో కట్టిన పార్కును ఎలా ఓపెనింగ్ చేస్తారు?" అని జనసైనికులు బహిరంగంగానే ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని




జనసేన అధినేత దృష్టికి తీసుకువెళ్లేందుకు జనసైనికులు సిద్ధమవుతున్నారు.

## తొందరపాటు ఎందుకు?

నిజానికి పార్కు పనులు ఇంకా 10 శాతం మేర పెండింగ్‌లో ఉన్నాయి. పూర్తిస్థాయిలో ఫినిషింగ్ కాకముందే ఎంపీ, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌లతో రిబ్బన్ కట్ చేయించడం వెనుక రాజకీయ పైచేయి తప్ప అభివృద్ధి కాదనే విమర్శలు వినిపిస్తున్నాయి. భవిష్యత్తులో ఇలాంటి అవమానాలు పునరావృతం కాకుండా పార్టీ అధిష్టానం సీరియస్‌గా స్పందించాలని, కూటమి ధర్మాన్ని పాటించాలని జనసేన వర్గాలు తీవ్రంగా డిమాండ్ చేస్తున్నాయి.

## కూటమి ధర్మం పాటించని టీడీపీ..

జిల్లాలో ఏ కార్యక్రమం జరిగినా జనసేన ఉనికిని పూర్తిగా విస్మరిస్తుండటం, కనీసం మిత్రపక్షంగా గౌరవం ఇవ్వకపోవడంపై ఆ పార్టీ శ్రేణులు రగిలిపోతున్నాయి. కేవలం ఆరు నెలల్లోనే శ్రీకాకుళం నగరపాలక సంస్థతో పాటు జిల్లాలోని మరో మూడు మున్సిపాలిటీలు, 900కు పైగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్న తరుణంలో.. క్షేత్రస్థాయిలో సమన్వయం లోపిస్తే కూటమికి కోలుకోలేని దెబ్బ తగిలే ప్రమాదం ఉంది. ఇప్పటికే బీజేపీ నేతలను, జనసేన కార్యకర్తలను కలుపుకొని పోవడంలో వైఫల్యం కనిపిస్తోందని, ఇదే ధోరణి కొనసాగితే రాబోయే స్థానిక పోరులో గెలుపు గుర్రం ఎక్కడం కష్టతరమేనని రాజకీయ విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవమానాలు పునరావృతం కాకుండా, మిత్రధర్మాన్ని పాటిస్తూ అందరినీ కలుపుకొని పోకపోతే.. అధికార పక్షానికి ఇబ్బందులు తప్పవని జనసైనికులు బాహాటంగానే హెచ్చరిస్తున్నారు.



# అంతం లేని ఆంపురం.. భూబాగోతం!

* ఏళ్ల తరబడి సాగుతున్న భూ వివాదం * డి పట్టా భూమికి అక్రమ మ్యుటేషన్ * పట్టాలు రద్దు చేయాలని... ఆక్రమణలు తొలగించాలని లోకాయుక్త ఆదేశాలు * తాజాగా మరో న్యాయస్థానంలో వివాదం

కంచిలి, మార్చి 22(వార్త): కంచిలి మండలం అంపురం గ్రామ రెవెన్యూలో ఎకరా డి పట్టా భూమి వివాదం ఏళ్ల తరబడి నలుగుతోంది. రాష్ట్ర లోకాయుక్త సంస్థ సదరు భూమి పట్టాలు రద్దు చేయాలని, అక్రమంగా ఇతరుల పేరిట చేసిన మ్యుటేషన్లు రద్దు చేయాలని, అందులో ఆక్రమణలు తొలగించాలని ఇచ్చిన ఆదేశాలు అధికారులు అమలు చేయలేదన్న సంగతి అలా ఉంచితే.. ఈ వివాదంలో ఇన్నాళ్లకు ఓ కొత్త వ్యక్తి ప్రవేశించి సదరు భూమికి తానే వారసుడునంటూ ఉన్నత న్యాయస్థానంలో అపీల్ చేయడం తో ఈ భూభాగోతం మరో కొత్త మలుపు తిరిగింది. అంపురం గ్రామానికి, బైరిపురం జంక్షన్ కు మధ్య జాతీయ రహదారి పక్కన చెరువును ఆనుకొని ఉన్న సుమారు ఐదు కోట్ల రూపాయల విలువైన ఎకరా 12 సెంట్లు భూమి వివాదాల సుడిగుండంలో నలుగుతుంది. కంచిలి మండలం రెవెన్యూ శాఖ డి పట్టా రిజిస్టర్ ప్రకారం దశాబ్దాల క్రితం ఈ ప్రాంతంలో అనుపోజు లక్ష్మి అనే మహిళకు 1.12 ఎకరాల భూమిని కేటాయించి డి పట్టా జారీ చేశారు. సదరు భూమి లబ్దిదారుల నుంచి అసైన్డ్ భూముల చట్టానికి విరుద్ధంగా పలువురు వ్యక్తుల చేతులు మారి చివరకు ఓ ప్రభుత్వ ఉద్యోగి చేతికి చేరింది. అప్పటివరకు ఎటువంటి వివాదాలు లేకుండా వ్యవహారాలు సామరస్యంగా సాగిపోయాయి.

## మూడేళ్ల క్రితం వివాదానికి బీజం..


జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ భూమి అంచున ఓ మూల ఓ సాధారణ వ్యక్తి గత



ప్రభుత్వ హయాంలో ప్రకటించిన ఫిష్ ఆంధ్ర పథకంలో భాగంగా చేపలవిక్రయానికి ఓ షాపు ఏర్పాటుకు కంటైనర్ను పెట్టాడు. దీంతో ఆ భూమికి సంబంధించిన యజమానులు, కంటైనర్ యజమానికి మధ్య వివాదం మొదలైంది. చిలికి చిలికి గాలి వానలా ఇక్కడ భూమి విషయం వివాదాస్పదమని, అక్రమంగా చేతులు మారిందని ఓ వ్యక్తి లోకాయుక్తను ఆశ్రయించారు. కేసును విచారించిన లోకాయుక్త గత ఏడాది మే నెలలో తీర్పును వెలువరించింది. డి పట్టాగా ఇచ్చిన సదరు భూమిని 2018లో అప్పటి తాసిల్దార్ తనకున్న అధికారాలు దుర్వినియోగం చేస్తూ అసైన్డ్ ల్యాండ్ చట్టానికి విరుద్ధంగా సరైన డాక్యుమెంట్లు లేకుండా అక్రమంగా ఇతరులకు మ్యుటేషన్ చేశారని, సదర్ రిజిస్ట్రేషన్ చెల్లదని అలా ఈ భూమిని ఇతరులకు



విక్రయించడం చట్ట విరుద్ధమని తేల్చింది. లోకాయుక్త తీర్పు మేరకు జిల్లా జాయింట్ కలెక్టర్ కంచిలి తాసిల్దార్‌కు కొద్ది నెలల క్రితం ఆదేశాలు జారీ చేస్తూ సదరు భూమిలో ఇచ్చిన డీకేటీ పట్టాను రద్దు పరుస్తూ భూమిని స్వాధీనం చేసుకోవాలని సూచించారు. అలాగే ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేసి 15 రోజుల్లోగా ఆక్రమణలు తొలగించాలని సూచించారు. అటు లోకాయుక్త ఆదేశాలు ఇటు జిల్లా అధికారుల సూచనలు ఏ ఒక్కటి ఇక్కడ అమలు కాకపోవడం గమనార్హం.



...without authority and without any supporting documentation, which ... gross irregularity and misuse of official powers.

ORDER:

Now, therefore, in exercise of powers conferred under Section 9 of the A.P. Rights in Land and Pattadar Passbooks Act, 1971, it is hereby ordered that;

1. The mutation entry dated 04.09.2018 in favour of Sri Challa Dasaradha in respect of land in Sy.No.16/1B of Ampuram Revenue Village, Kanchili Mandal is hereby cancelled forthwith, being violative of the A.P. Assigned Lands (Prohibition of Transfers) Act, 1977 and ROR Act, 1971.
2. The land shall stand restored to its original assignment status as per the D-Patta Register, as per the provisions laid down under A.P. Assigned Lands (Prohibition of Transfers) Act, 1977.
3. The Tahsildar, Kanchili is directed to:
   - Cancel the DKT pattas and resume the land to Govt.
   - Issue Notices to the encroachers on the subject land under the provisions of A.P. Assigned Lands (Prohibition of Transfers) Act, 1977 and remove the encroachments in 15 days.

Accordingly, the matter is disposed of with the above directions. Any deviation or non compliance will be viewed seriously.

Joint Collector,
Srikakulam

## వివాదంలో కొత్త మలుపు..

ఇదే భూమిపై కొనసాగుతున్న వివాదంలో మరో కొత్త మలుపు మొదలైంది. అనేక నెలలపాటు లోకాయుక్త పరిధిలో జరిగిన విచారణ సందర్భంలో గాని, పట్టా రద్దు కోసం ముందుగా భూమి వద్ద అక్రమ కట్టడాలపై అతికించిన నోటీసుకు గాని ఎవరు స్పందించకపోయినా ఓ కొత్త వ్యక్తి మాత్రం ఈ భూమికి తానే వారసుడునని తాజాగా ఉన్నత న్యాయస్థానానికి వెళ్లి స్టే తెచ్చుకోవడం కొసమెరుపు. ఈ భూమికి పట్టాదారు అయిన అనుపోజు లక్ష్మి అనే మహిళకు తాను నిజమైన వారసుడునని న్యాయస్థానానికి నిరూపించుకొని భూమిని చేజిక్కించుకుంటారా లేక లోకాయుక్త ఆదేశాల ప్రకారం రెవెన్యూ అధికారులు సదరు భూమిని తిరిగి స్వాధీనం చేసుకుంటారో వేచి చూడాల్సి ఉంది. కంచిలి మండలంలో ఈ వ్యవహారం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

## హైకోర్టు ఆదేశాలతో ఆగిపోవాల్సి వచ్చింది : తహసిల్దార్

లోకాయుక్త ఆదేశాలను అమలు చేయాలన్న సందర్భంలోనే అవతల వ్యక్తులు హైకోర్టుకు వెళ్లి స్టే తీసుకురావడంతో ఆగిపోవాల్సి వచ్చిందని తాసిల్దార్ రమేష్ కుమార్ 'జాతీయ వార్త'కు వివరణ ఇచ్చారు. లోకాయుక్త నుంచి భూమి ప్రభుత్వం స్వాధీనం చేసుకోమని ఆదేశాలు రావడం వాస్తవమేనని పేర్కొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం




## జేసీఐ ఆధ్వర్యంలో ఈపీఎస్

**ఇచ్ఛాపురం, మార్చి 22 (వార్త):** జేసీఐ ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో ఎఫెక్టివ్ పబ్లిక్ స్పీకింగ్ కార్యక్రమం వి.జె గ్రాండ్ ఫంక్షన్ హాల్‌లో విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో జేసీలు, నాన్-జేసీలు, ఉపాధ్యాయులు, కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఇది విభిన్నతతో కూడిన ప్రయోజనకరమైన అభ్యాస అనుభవంగా నిలిచింది. ప్రెసిడెంట్ జేసీ శ్రవణ్ బోయినా స్వయంగా పాల్గొని ప్రేరణాత్మక ఉపన్యాసం అందించారు. ఆయన సమగ్ర ప్రణాళిక, అమలు విధానం, ప్రత్యేక బహుమతులు సర్టిఫికెట్లు అందిస్తూ సభ్యులను ప్రోత్సహించడం జరిగింది. ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రముఖ ట్రైనర్లు నిర్వహించారు. జెఎఫ్ఎస్ రాజిత పూసర్ల, నేషనల్ ట్రైనర్ జేసీ హెచ్‌జీఎఫ్ జయలక్ష్మి, నేషనల్ ట్రైనర్ జేసీ హెచ్‌జీఎఫ్ ఈశ్వరరావు, జోన్ ట్రైనర్లు ప్రజా ప్రసంగ పద్ధతులు, శరీర భాష, నిలువు తీరు ప్రసంగాన్ని సమర్థవంతంగా అందించే విధానాలపై అద్భుతమైన శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ డా.సంతోష్ సాహు, ట్రెజరర్ జేసీ రేణుక, జెఎఫ్‌డీ తంగుడు శణ్ముఖ్, జెఎఫ్ఎం కల్లా జైదేవ్, జేసీ మాతురు స్వరూప్, జేసీ సిరీషా దాస్, జేసీ హెచ్‌జీఎఫ్ వేచా రాము, జేసీ హెచ్‌జీఎఫ్ పవన్, జేసీ వై. నరేష్, జేసీ కల్లా శ్రీనివాస్, జేసీ జి. రాజ్‌కమల్ తదితరులు పాల్గొన్నారు.



## కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేక ఉద్యమాన్ని
# నీరుగార్చే కుట్రలు



**మందస, మార్చి 22(వార్త):** కార్గో ఎయిర్ పోర్ట్ వ్యతిరేకంగా ఉద్దానంలో పోరాటం సాగుతుండగా.. మరో వైపు ఉద్యమాన్ని నీరుగార్చే ప్రయత్నాలు సాగుతున్నాయని బాధిత రైతులు ఆరోపించారు. మందస మండలంలోని రాంపురం పంచాయతీ బిడిమి గ్రామంలోని మాజీ ఎంఎల్ఏ స్వర్గీయ జుత్తు జగన్నాయకులు విగ్రహం వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కొంతమంది సానుభూతిపరులు, అధికార పక్షానికి అనుకూలంగా ఉన్నవ్యక్తులు శ్రీకాకుళం

* తిప్పికొట్టాలని ఉద్దానం బాధిత రైతుల పిలుపు * బిడిమిలో రైతులు ప్రత్యేక సమావేశం

కలెక్టరేట్‌కు వెళ్లి భూములు ఇవ్వడానికి అనుకూలంగా ఉన్నారని ప్రచారం జరుగుతోందని మా దృష్టికి వచ్చిందన్నారు. జుత్తు జగన్నాయకులు మా ప్రాంతానికి ఎంతో సేవలు చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ ప్రాంతం శ్రేయస్సు కోసం పని చేసిన ఆయన జీవించి ఉన్నట్లయితే ఈ పచ్చని ఉద్దానం ప్రాంతం ఇలాంటి పరిస్థితులకు వచ్చేది కాదనే భావనతో వారి స్మృతిలో మా స్వరం వినిపిస్తున్నామన్నారు. కానీ స్పష్టంగా చెబుతున్నామని, అది ఈ ప్రాంత ప్రజల అభిప్రాయం కాదు.. గత సంవత్సరం ఆరు నెలల కాలంగా మా నిర్ణయాన్ని స్పష్టంగా తెలియజేస్తూ వస్తున్నామన్నారు. ఆర్డీఓ, కలెక్టర్, ఎంఎల్ఏలకు ఇదే విషయాన్ని వినతి పత్రాల రూపంలో తెలియజేశామన్నారు. మా అభిప్రాయం ఒక్కటేనని, ఈ ప్రాంతం నుండి ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వమన్నారు. ఇటీవల మా నియోజకవర్గ ఎమ్మెల్యే శిరీషకు కూడా రాంపురం గ్రామ ప్రజలు నేరుగా ఇదే విషయం తెలియజేశారన్నారు. రైతులందరూ ఏకగ్రీవంగా ఒకే నిర్ణయంతో భూములు ఇవ్వమని స్పష్టం చేశారన్నారు. అయినా కూడా నేడు జరుగుతున్న ప్రజాభిప్రాయ సేకరణ ప్రజల నిజమైన అభిప్రాయానికి పూర్తిగా విరుద్ధమన్నారు. ఇటీవల హరిపురం సమీపంలోని మందస రైల్వే స్టేషన్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు వచ్చారని, ఆ కార్యక్రమం మా బిడిమి గ్రామానికి కేవలం 7కిలోమీటర్ల దూరంలోనే జరిగినప్పటికీ, మా సమస్యలు, మా అభిప్రాయాలను తెలుసుకోవడానికి మా గ్రామానికి రాకపోవడం బాధాకరమన్నారు. ఎవరు వచ్చినా సరే, రాకపోయినా సరే.. మా నిర్ణయం ఒక్కటేనని, ఈ ప్రాంతం నుండి ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వమన్నారు. ఎయిర్‌పోర్ట్ ప్రతిపాదనను ఇతర ప్రాంతానికి తరలించాలని మేము స్పష్టంగా కోరుకుంటున్నామని, ఈ ప్రాంత యువత, రైతుల తరఫున మేమంతా మరోసారి స్పష్టంగా చెబుతున్నామని, ఈ ప్రాంతం నుండి ఒక్క సెంటు భూమి కూడా ఇవ్వమన్నారు. కార్యక్రమంలో తెప్పల అప్పారావు, తెప్పల కృష్ణమూర్తి, గుంటు రామస్వామి, దున్న రామారావు, తామాడ లక్ష్మీనారాయణ, దున్న సురేష్, మర్ల సంతోష్, లబ్బ సురేష్ తదితరులు పాల్గొన్నారు





### భవిష్యత్తు తరాల కోసం
## నీటిని పొదుపుగా వాడాలి

**శ్రీకాకుళం, మార్చి 22 (వార్త):** ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నేషనల్ గ్రీన్ కోర్ జిల్లా కోఆర్డినేటర్ పూజారి గోవిందరావు ఆధ్వర్యంలో శ్రీకాకుళం పాత హౌసింగ్ బోర్డు కాలనీలోని నేతాజీ సుభాష్ చంద్ర బోస్ ఆవశ్య విద్యాలయం విద్యార్థులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాటాఌడుతూ భవిష్యత్ తరాల కోసం నీటిని పొదుపుగా వాడాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇంకుడుగుంతలు తవ్వి, నీట సంరక్షణ చేయాలన్నారు. నీరు ప్రవహించే చోట, సమానత్వం పెరుగుతుందన్నారు. 1993వ సంవత్సరం నుండి ప్రతి సంవత్సరం మార్చి22న ప్రపంచ జలదినోత్సవంను చేసుకుంటున్నామన్నారు. నీటి ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకొని నీటివనరులను సంరక్షించుకోవాలని ఆయన కోరారు. జీవుల మనగడకు నీరు అత్యంత అవసరమని, నీటిని పొదుపుగా వాడాలని వార్డెన్ మహందాత కోరారు. వాటర్ పైప్ లైన్లలో లీకేజీలను అరికట్టాలని జీవశాస్త్ర ఉపాధ్యాయులు వాడాడ త్రివిక్రమరావు కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతీ నీటి బొట్టు.. ప్రగతికి మెట్టు





**పలాస, మార్చి 22 (వార్త):** ప్రతీ నీటి బొట్టు.. ప్రగతికి మెట్టని పలువురు న్యాయవాదులు అన్నారు. ఆదివారం ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా పలాసలో ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల మహాత్మ జ్యోతి బాపూలే బాలికల గురుకుల పాఠశాలలో ప్రత్యేక న్యాయ విజ్ఞాన సదస్సును మండల న్యాయ సేవా సంఘం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జల దినోత్సవం సందర్భంగా నీటి వృధా అరికట్టాలని, తాగు నీటిని, సాగు నీటిని కాపాడుకోవాలని, ప్రతీ నీటి బొట్టు-ప్రగతికి మెట్టు అని తెలిపారు. నీటిని కాపాడుకుంటేనే జీవితమని, జలమే - జీవనమన్నారు. ప్రతీ ఒక్కరూ నీటి కాలుష్యంను అరికట్టి తద్వారా ప్రకృతికి సహకరించాలన్నారు. మానవ శరీరంలో జీవ క్రియలు, శరీరం లోపల, బయట శుభ్రతలు కూడా నీటిపై ఆధారపడి వున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు బి.కామేశ్వరరావు పట్నాయక్, కె.దేవరాజు, కె.లోకేశ్వరరావు, పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాధర్, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

### మృతుల కుటుంబాలకు
## జుత్తు నీలకంఠం పరామర్శ



**మందస, మార్చి 22(వార్త):** పలు మృతుల కుటుంబాలకు అగ్నికుల క్షత్రియ రాష్ట్ర మాజీ డైరక్టర్, మాజీ ఎంఎల్ఏ స్వర్గీయ జుత్తు జగన్నాయకుల సోదరుడు జుత్తు నీలకంఠం ఓదార్పు కార్యక్రమంలో భాగంగా పరామర్శించారు. వజ్రపుకొత్తూరు మండలం వజ్రపుకొత్తూరులో గ్రామ పెద్ద పోతనపల్లి శ్రీనివాస్ భార్య, మాజీ సర్పంచ్ లక్ష్మీకాంతం హటాత్తుగా మరణించారు. అదే విధంగా లింగాలపేట గ్రామంలో లింగాల పోలమ్మ కిడ్నీ వ్యాధితో మరణం చెందారు. వీరి కుటుంబాలను నీలకంఠం పరామర్శించి, ఓదార్చారు. ఇరువురి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థించారు. ఆయనతో పాటు గ్రామపెద్దలు, కులపెద్దలు కూడా ఉన్నారు.

## కొత్తూరులో నారీ శక్తిపై అవగాహన

**పలాస, మార్చి 22 (వార్త):** పలాస మండలం తర్లాకోట పంచాయతీ పరిధిలోని కొత్తూరు గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో ప్రజల్లో చైతన్యం కలిగించే అవగాహన కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాశీబుగ్గ ఎస్సై ఆర్. నరసింహమూర్తి హాజరై పలు కీలక అంశాలపై గ్రామస్తులకు వివరించారు. ఈ సందర్భంగా నారీ శక్తి ప్రాధాన్యతను వివరించిన ఎస్సై, మహిళలు తమ హక్కులను తెలుసుకుని ధైర్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సైబర్ క్రైమ్ పెరుగుతున్న నేపథ్యంలో అపరిచిత లింకులు, ఫోన్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. బాల్య వివాహాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిస్తూ, అటువంటి ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. 'సంకల్పం' కార్యక్రమం ద్వారా యువతలో సానుకూల మార్పు తీసుకురావాలని తెలిపారు. మైనర్ డ్రైవింగ్ ప్రమాదకరమని, తల్లిదండ్రులు పిల్లలకు వాహనాలు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి

### టీడీపీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన

**మందస, మార్చి 22(వార్త):** స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలని తెలుగుదేశం పార్టీ మందస మండల అధ్యక్షుడు బావన దుర్యోధన పిలుపునిచ్చారు. మందస పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక పంచాయతీ ఎన్నికలే ఎజెండాగా కలిసి కట్టుగా పని చేయాలని కోరారు. పలాస నియోజకవర్గం శాసన సభ్యురాలు గౌతు శిరీష, సమన్వయకర్త వెంకన్నచౌదరి ఆదేశాల మేరకు కీలక సమావేశం నిర్వహించామన్నారు. రాబోయే ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా తెలుగుదేశం పార్టీ క్షేత్రస్థాయి వ్యూహాలకు పదును పెట్టిందన్నారు. క్లస్టర్, యూనిట్, బూత్ లెవెల్ స్థాయి నాయకులు ఎన్నికలకు సమాయత్తం కావాలన్నారు. ప్రతీ నాయకుడు, కార్యకర్త బూత్‌ల వారీగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీకి దూరంగా ఉన్న వారిని గుర్తించి, గత ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ, వారిని మన వైపు మొగ్గు చూపేలా చేయాలని, ప్రతీ ఇంటి తలుపు తట్టి, ప్రజల సమస్యలు తెలుసుకుని, వారికి అండగా నిలవాలని ఆయన సూచించారు. ఇప్పుడు మనం అభివృద్ధి చెయ్యాల్సిన పనులు త్వరగా కంప్లీట్ చేసి, ఇంకా అందాల్సిన సంక్షేమ అభివృద్ధి పథకాలు, కొన్ని అందని ప్రత్యేక పంచాయతీలు, గ్రామాలు గుర్తించి, వారికి కూడా అన్ని సంక్షేమ పథకాలు చేకూరేలా చెయ్యాలని పిలుపునిచ్చారు. మై టీడీపీ యాప్ డౌన్లోడ్ చేసి మనం చేసిన ప్రతి ప్రోగ్రాం అందులో అప్లోడ్ చెయ్యాలన్నారు. రానున్న ఎన్నికల్లో గెలుపునకు ఈ సమావేశం అత్యంత కీలకమని ఆయన ప్రాధాన్యతనిచ్చారు. ఈ సమావేశంలో పాల్గొన్న క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్లు, కో-కన్వీనర్లు అధిక సంఖ్యలో పాల్గొని, ఈ వ్యూహాన్ని క్షేత్రస్థాయిలో ఎలా అమలు చేయాలనే దానిపై విస్తృతంగా చర్చించారు.. ప్రతీ బూత్‌లో పార్టీని బలోపేతం చేసేందుకు తక్షణ కార్యాచరణను రూపొందించుకున్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి, సాలిన మాధవ రావు, క్లస్టర్ ఇంచార్జి చంద్రశేఖర్ ముంజేటి, కోఇంచార్జీ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## బొడ్డపాడులో భగత్ సింగ్ వర్ధంతిని జయప్రదం చేయాలి





**పలాస, మార్చి 22 (వార్త):** భగత్ సింగ్, రాజగురు, సుఖ్ దేవ్‌ల 95వ వర్ధంతిని బొడ్డపాడు యువజన సంఘం ఆద్వర్యంలో సోమవారం బొడ్డపాడు గ్రామంలో అమరవీరుల స్మారక మందిరంలో నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం జయప్రదం చేయాలని బొడ్డపాడు యువజన సంఘం ప్రతినిధులు కోరారు. ప్రజా సంఘాలు, వామపక్ష నేతలు పాల్గొనాలని కోరారు.

## ఈదుపురంలో రూ.14లక్షలతో అభివృద్ధి పనులు



**ఇచ్ఛాపురం, మార్చి22 (వార్త):** ఈదుపురంగ్రామ అభివృద్ధి దిశగా కీలక అడుగు పడింది. జిల్లా పరిషత్ చైర్మన్ నిధుల నుండి డ్రైన్ నిర్మాణానికి రూ.4 లక్షలు, బజారు రోడ్డు అభివృద్ధికి రూ.10 లక్షలు కలిపి మొత్తం రూ.14 లక్షలు మంజూరైందని గ్రామ సర్పంచ్ నర్తు వరప్రసాద్ తెలిపారు. ఈ నిధులతో గ్రామంలోని బజారు రోడ్డు అభివృద్ధి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఈదుపురం గ్రామ ఇన్ ల్యాండ్ ఫిషరీస్ కోఆపరేటివ్ సొసైటీ తరఫున జిల్లా పరిషత్ చైర్ పర్సన్ విజయమ్మకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నర్తు ప్రసాద్, వైస్ ఎంపిపి వివేకానంద రెడ్డి, యూత్ లీడర్ హంగీర్ బెహరా, జెడ్పీటీసీ ఉప్పాడ నారాయణమ్మ, ఫిషరీస్ ప్రెసిడెంట్ గయా రామచంద్ర, వైస్ సర్పంచ్ ముర, లోకానాథ్, బోనమలి, ఉదయ్, రఘు, యాంగిచ్, చంద్రయ్య పాల్గొన్నారు.

## జల సంరక్షణ మనందరి బాధ్యత

**శ్రీకాకుళం, మార్చి 22 (వార్త):** నీటిని పొదుపుగా వాడటం, వనరులను సద్వినియోగం చేసుకోవడం, కలుషితం కాకుండా కాపాడటమే ఈ ఏడాది ప్రపంచ జల దినోత్సవ ముఖ్య ఉద్దేశమని పోలవరం ప్రాజెక్ట్ (నాణ్యతా ప్రమాణాల విభాగం) పర్యవేక్షణ ఇంజినీర్ డోల తిరుమలరావు అన్నారు. ఆదివారం శ్రీకాకుళంలోని వంశధార ప్రాజెక్ట్ కార్యాలయంలో ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆఫ్ ఇండియా పూర్వపు చైర్మన్ ప్రొఫెసర్ డి. విష్ణుమూర్తి సారధ్యంలో ప్రపంచ జల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తిరుమలరావు మాట్లాడుతూ.. ప్రపంచవ్యాప్తంగా నీటి ప్రాముఖ్యతపై అవగాహన పెరుగుతోందని పేర్కొన్నారు. మన చుట్టూ ఉన్న నీటి వనరులను రక్షించుకోవడంతో పాటు, మహిళలపై నీటి సేకరణ భారాన్ని తగ్గించడం, అందరికీ సమానంగా నీరు అందేలా చూడటం మన ప్రాథమిక లక్ష్యాలు కావాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకల్లో రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ ఎన్. రాంబాబు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ ఎం. శ్రీనివాస్, రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.వి. రమణ పాల్గొని జల సంరక్షణ ఆవశ్యకతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీర్లు పాపారావు, సంతోష్ రాజ్, మన్మధరావు, డాక్టర్ వాణి, రామలక్ష్మి, ప్రొఫెసర్ డాక్టర్ రాత్, ఢిల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



### నిధుల వినియోగంలో
# పారదర్శకత ఉండాలి

* జడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ * అక్రమాలపై విచారణ జరపాలి * ఎమ్మెల్యే కూన రవికుమార్
* ముగిసిన జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశాలు





**శ్రీకాకుళం, మార్చి 22 (వార్త):** జిల్లా అభివృద్ధి పథకాల అమలులో వేగం పెంచాలని, ప్రభుత్వ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా ప్రజా పరిషత్ సమావేశ మందిరంలో ఆమె అధ్యక్షతన 1, 2, 4, 7వ స్థాయి సంఘాల సమావేశాలు సుదీర్ఘంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులు సూచించిన పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేసి, నివేదికలను సిద్ధం చేయాలన్నారు. రెండో స్థాయి సంఘం పరిధిలోని డిఆర్‌డిఏ, డ్వామా, ఖాదీ, చేనేత, సహకార, టూరిజం శాఖల ప్రగతిపై చైర్‌పర్సన్ సమీక్షించారు. ఏడో స్థాయి సంఘం పరిధిలోని వంశధార ప్రాజెక్ట్ పనులు, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ విభాగం చేపడుతున్న రహదారుల అభివృద్ధిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆర్టీసీ, సర్వశిక్షా అభియాన్, వైద్య ఆరోగ్య శాఖల పనితీరుపై సుదీర్ఘ సమీక్ష చేస్తూ, ప్రజలకు సేవలు అందడంలో జాప్యం జరగకూడదని స్పష్టం చేశారు. ఆమదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయుసీ చైర్మన్ కూన రవికుమార్ మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో భారీగా అవకతవకలు, స్కామ్‌లు జరిగాయని ఆరోపించారు. వీటిపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని రవికుమార్ సూచించారు. అభివృద్ధి పనుల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులను సహించేది లేదు. ప్రతి పైసా అర్హులైన పేదలకు అందాలని ఆయన హెచ్చరించారు. జిల్లా సమగ్ర అభివృద్ధికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశాలలో ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పీ సీఈఓ డి.సత్యనారాయణ, వివిధ మండలాల జెడ్పీటీసీ సభ్యులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## వసతి గృహాన్ని వినియోగించుకోండి

**జలుమూరు, మార్చి 22 (వార్త):** దక్షిణ కాశీగా పేరుగాంచిన శ్రీముఖలింగేశ్వర ఆలయానికి వచ్చే భక్తులు వసతి గృహాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలయ ఈవో ఏడుకొండలు సూచించారు. సుదూర ప్రాంతాల నుండి ఆలయానికి దర్శనార్థం వచ్చే భక్తులు వసతి సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, ఆలయ ఆవరణంలోనే సుమారు 30 మీటర్ల దూరంలో 100 మంది వరకు సరిపడ వసతి గృహం పడక గదులు, స్నానాల గది అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఈ వసతి గృహాన్ని భక్తుల సౌకర్యార్థం తక్కువ ధరలో అందిస్తున్నామని ట్రస్ట్ బోర్డు చైర్మన్ శివప్రసాద్ పేర్కొన్నారు. ఆలయానికి వచ్చే ప్రతి భక్తుడు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు.






## కాలువపై విరిగిన పలకలు

**సారవకోట, మార్చి 22 (వార్త):** సారవకోటలో మండల విద్యాశాఖ కార్యాలయం సమీపంలో ఉన్న కాలువపై ఏర్పాటు చేసిన పలకలు విరిగిపోవడంతో ప్రమాదం నెలకొంది. ఈ కారణంగా కార్యాలయాలకు వచ్చే వాహనాలు, ముఖ్యంగా అత్యవసర సమయాల్లో వచ్చే 108 అంబులెన్స్ వంటి వాహనాలు కాలువలో కూరుకుపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మండల విద్యాశాఖ కార్యాలయం పక్కన తహసీల్దార్ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి భారీ ప్రోక్లైనర్ యంత్రం ఈ పలకల మీదుగా వెళ్లడంతో అవి విరిగిపోయినట్లు తెలుస్తోంది. దీంతో రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడటమే కాకుండా ప్రమాదాలు సంభవించే అవకాశముందని స్థానికులు పేర్కొన్నారు. వెంటనే ఈ పలకలను మరమ్మతు చేసి భద్రతా చర్యలు చేపట్టాలని వారు అధికారులను కోరుతున్నారు.

## నిర్లక్ష్యంతో మూలకు చేరిన చేతి పంపులు



**నరసన్నపేట, మార్చి 22 (వార్త):** నరసన్నపేట మండల పరిధిలో వందలాది చేతి పంపులు నిర్వహణ లోపంతో మూలకు చేరిన పరిస్థితి నెలకొంది. రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని వీటిని తిరిగి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. నరసన్నపేట గ్రామపంచాయతీ పరిధిలోనే సుమారు 60 చేతి పంపులు నిర్లక్ష్యానికి గురై పనిచేయకుండా ఉండిపోయాయని స్థానికులు తెలిపారు. సరైన మరమ్మతులు చేయకపోవడంతో ఇవి శిథిలావస్థకు చేరుకున్నాయని పేర్కొన్నారు. ప్రజల తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ఏర్పాటు చేసిన ఈ పంపులు వినియోగంలో లేకపోవడం వల్ల ఆ నిధులు వృథా అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి కాలంలో నీటి కొరత తీవ్రంగా ఉండే పరిస్థితిలో వెంటనే మరమ్మతులు చేపట్టి ఈ పంపులను పునరుద్ధరించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

## ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



**పోలాకి, మార్చి 22 (వార్త):** పోలాకి మండలం రాళ్ళగోదాయవలస గ్రామంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు దీనిపై ఇప్పటివరకు దృష్టి సారించకపోవడం గ్రామస్తుల్లో ఆందోళన కలిగిస్తోంది. గత కొంతకాలంగా ట్రాన్స్ఫార్మర్ చుట్టూ జంగిల్ విస్తరించి ఉండటంతో ప్రమాదం ముప్పు మరింత పెరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ట్రాన్స్ఫార్మర్ ద్వారా సుమారు 300 ఇళ్లకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో ఏ సమయంలోనైనా ప్రమాదం సంభవించే అవకాశం ఉందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా గ్రామంలో కొన్ని విద్యుత్ స్తంభాలు పాడుబడిన పరిస్థితిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకుని ట్రాన్స్ఫార్మర్ చుట్టూ శుభ్రపరిచే పనులు చేపట్టి, పాడుబడిన స్తంభాలను మరమ్మతులు చేయాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

## రాజుల చెరువులో అక్రమ నిర్మాణానికి అడ్డుకట్ట



**నరసన్నపేట, మార్చి 22 (వార్త):** నరసన్నపేటలోని రాజుల చెరువు గర్భంలో అక్రమంగా నిర్మాణం చేపడుతున్న కట్టడాన్ని గ్రామపంచాయతీ సిబ్బంది ఆదివారం అడ్డుకున్నారు. సెలవు రోజులను ఆసరాగా చేసుకుని అక్రమ నిర్మాణాలు శరవేగంగా కొనసాగుతున్నాయని వచ్చిన ఫిర్యాదుల మేరకు అధికారులు ఈ చర్యలు చేపట్టారు. ఒకప్పుడు సుమారు 50 ఎకరాల విస్తీర్ణం కలిగిన రాజుల చెరువు, ఆక్రమణల కారణంగా ప్రస్తుతం 10 ఎకరాలకూ తగ్గిపోయిన పరిస్థితి ఉందని స్థానికులు తెలిపారు. చెరువు ఆక్రమణలతో సహజ వనరులు నశిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన ఆక్రమణలను కూడా వెంటనే తొలగించి చెరువును సంరక్షించాలని నరసన్నపేటవాసులు అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు.

## పోటెత్తిన ఆదిత్యుని ఆలయం

**అరసవల్లి, మార్చి 22 (వార్త):** అరసవల్లి సూర్యనారాయణ స్వామి దేవస్థానానికి పెద్ద ఎత్తున భక్తులు ఆదివారం పోటెత్తారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. టికెట్లు రూపేనా రూ.3,71,300లు, పూజలు మరియు విరాళాల రూపంలో రూ.63059లు, ప్రసాదాల రూపంలో రూ.2,02740లు, దర్శనం, సూర్యనమస్కారములు, వివిధ సేవలు మరియు ప్రసాదాల బుకింగ్ ను మరింత సులభతరం చేస్తూ ఆన్‌లైన్ రిజర్వేషన్ ద్వారా మొత్తం రూపంలో రూ.50,200లు స్వామి వారికి ఆదాయం వచ్చిందని ఆలయ ఈవో ప్రసాద్ తెలిపారు.

## నంది విగ్రహం ధ్వంసం..

# హిందూ మనోభావాలపై దాడి

### * వైసీపీ ఇన్చార్జ్ శ్యాం ప్రసాద్ రెడ్డి

**సోంపేట మార్చి 22(వార్త):** బారువ గ్రామంలో ఉమామహేశ్వ దేవాలయంలో నందీశ్వర రాతి విగ్రహం పీఠం సహితంగా చోరులు ఎత్తుకొని పోయి విగ్రహాన్ని పగలగొట్టడం హిందువుల విశ్వాసాలను దెబ్బతీసేలా ఉందని ఇచ్ఛాపురం నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త శాడి శ్యాం ప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ ప్రతినిధి బృందం బారువలోని ఉమామహేశ్వర దేవాలయాన్ని ఆదివారం సందర్శించారు. నందీశ్వరుని విగ్రహం ధ్వంసం ఘటనపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుండి హైందవ దేవాలయాలలో అపచారాలు అధికమయ్యాయని అన్నారు. తిరుపతిలో 2025 జనవరిలో వైకుంఠ ఏకాదశి నాడు క్యూలైన్ తొక్కిసలాటలో 6 గురు భక్తులు మరణించగా సుమారు 30 మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. సింహాచలంలో 2025 మార్చి చందనోత్సవం సందర్భంగా గోడ కూలి 7 గురు భక్తులు మరణించారన్నారు. తిరుపతి వెంకన్న స్వామి ప్రసాదాన్నే రాజకీయాలలోకి తీసుకువచ్చి భక్తుల విశ్వాసాలతో, మనోభావాలతో చెలగాటమాడారన్నారు. వరుసగా హైందవ దేవాలయాల్లో మాత్రమే అపచారాలు, దుర్మార్గాలు వంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. హైందవ ఆచారాలపైన, హిందూ ఆలయాలలోను జరుగుతున్న దురాగతాలు, దురాచారాలకు కూటమి ప్రభుత్వం నైతిక బాధ్యత వహించాలని శ్యాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో నడపబడుచున్న ఈ దేవాలయ ప్రాంగణంలో జరిగిన దురాగతం ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే జరిగిందన్నారు. బారువ ఉమామహేశ్వర దేవాలయాలపై జరిగిన దాడికి ప్రభుత్వమే బాధ్యత వహించి అపచారానికి



ప్రాయశ్చిత్తం చేసుకొని శాస్త్రోక్తంగా నంది విగ్రహాన్ని పునఃస్థాపన చేయాలని, తక్షణమే దోషులను పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయం వంశ పారంపర్య ధర్మకర్త భువనేశ్వర్ పాణిగ్రాహి, వైసిపి బి.సి విభాగం రాష్ట్ర కార్యదర్శి నర్తు నరేంద్ర యాదవ్, ఎస్.సి విభాగం రాష్ట్ర కార్యదర్శి సల్ల దేవరాజు, నియోజకవర్గం యువజన విభాగం అధ్యక్షుడు నర్తు ప్రేమ్ కుమార్, బారువ, పలాసపురం ఈదుపురం సర్పంచ్‌లు యర్ర రజని, తడక జోగారావు, నర్తు వరప్రసాద్, సోంపేట వైస్ ఎంపిపి గుర్రాల శ్రీనివాస్, తామాడ బుజ్జి, మాజీ వైఎస్ ఎంపిపి మాధవరావు, ఆనంద్ పాణిగ్రాహి, మేరుగు తిరుపతి రెడ్డి, నర్తు భానోజీరావు, జుత్తు కామేశ్వరరావు, సప్ప వంశీ, సాడి జయరాం రెడ్డి, జుత్తు బేసింగ్ యాదవ్, కొయ్య గోపాల్ రెడ్డి, జుత్తు మోహనరావు, వైసిపి బారువ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్

**జలుమూరు, మార్చి 22 (వార్త):** లింగాలవలస జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు ఉపాధ్యాయురాలు గన్నెమ్మ తెలిపారు. సోమవారం జరగనున్న మ్యాథ్స్ పరీక్షను దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ప్రత్యేకంగా తర్ఫీదు అందిస్తున్నామన్నారు. పాఠ్యాంశాలను పునరావృతం చేయిస్తూ, పరీక్షలో మంచి ఫలితాలు సాధించేందుకు మార్గనిర్దేశం చేస్తున్నామని చెప్పారు. విద్యార్థులు ఎటువంటి ఒత్తిడి లేకుండా ధైర్యంగా పరీక్షలకు హాజరుకావాలని ఆమె సూచించారు. ఎంఈఓ ఆదేశాల మేరకు ఈ స్టడీ అవర్స్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని తెలిపారు.



## గొలివి హాస్పిటల్‌లో

# ప్రతిభావంతులకు సన్మానం



**నరసన్నపేట, మార్చి 22 (వార్త):** నరసన్నపేటలోని గొలివి హాస్పిటల్‌లో ప్రతిభ కనబరిచిన అభ్యర్థులకు శనివారం రాత్రి సన్మానించారు. ఇటీవల గ్రూప్-1, గ్రూప్-2తో పాటు వివిధ శాఖలలో విజయం సాధించిన పలువురిని ఈ సందర్భంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య పనుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ రాణి మోహన్, సీఐ శ్రీనివాసరావు, ఎస్సై గణేష్ పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి సాధించిన విజయాలు యువతకు ఆదర్శంగా నిలుస్తాయని వారు పేర్కొన్నారు. ప్రత్యేకంగా డీఎస్పీ ర్యాంక్‌లో విజయం సాధించిన పైల సుందర్‌రావును సత్కరించారు. ఆయన సాధించిన విజయాన్ని అభినందిస్తూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్థానికులు పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**బూర్జ, మార్చి 22 (వార్త):** బూర్జ మండలంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు కుటుంబాలకు వైద్య ఖర్చులు నిమిత్తం చికిత్స నిమిత్తం ఆర్థిక సహాయంగా వారి కుటుంబాలకి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి వచ్చిన చెక్కులను ఆమదాలవలస ఎమ్మెల్యే సతీమణి, పొందూరు మాజీ ఎంపీపీ కూన ప్రమీల లబ్ధిదారులకు ఆదివారం పంపిణీ చేశారు. టీడీపీ నేత ఆనెపు రామకృష్ణం నాయుడితో కలిసి లబ్ధిదారులు కుటుంబాల ఇంటి వద్దకు వెళ్లి వారిని పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకున్నారు. పెద్దలంకాం గ్రామానికి చెందిన కుమరాపు వరంనకు రూ.77వేలు, గుత్తావల్లి గ్రామానికి చెందిన చల్లా రాజేశ్వరరావుకు రూ.18,300, లాబం గ్రామానికి చెందిన దువ్వరపు ఇందుకు రూ.27వేలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులైన ప్రతీ కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉగాది పురస్కార గ్రహీతలకు మంత్రి అభినందన

**శ్రీకాకుళం, మార్చి 22 (వార్త):** సాహిత్యం, సంగీతం, నృత్యం, సామాజిక కార్యక్రమాల్లో అందించిన విశిష్ట సేవలకు గాను ఉగాది పురస్కారం అందుకున్న శ్రీకాకుళం వాసులను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇటీవల రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన కవిటి మండలానికి చెందిన పిరియా చలపతిరావు, హిరమండలానికి చెందిన అర్జంగి లింగమూర్తి, నరసన్నపేటకు చెందిన ఆవల జగన్నాథం తదితరులు ఉగాది పురస్కారాలను అందుకున్నారు.

## భూగర్భ జలాలు పరిరక్షణ

# మనందరి బాధ్యత

### * రిటైర్డ్ భూగర్భ జల శాఖ సహాయ సంచాలకులు లక్ష్మణరావు * స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవం



**శ్రీకాకుళం, మార్చి 22 (వార్త):** సమస్త జీవకోటికి ప్రాణాధారం జలం అని, ఏ జీవి అయినా సజీవంగా జీవించాలంటే జలమే ఆధారమని దీన్ని గ్రహించి ప్రతీ ఒక్కరూ జల సంరక్షణకు శక్తివంచన లేకుండా పాటు పడాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆదివారం శ్రీకాకుళం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచ జల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో.. రిటైర్డ్ భూగర్భ జల శాఖ సహాయ సంచాలకులు దుప్పల లక్ష్మణరావు మాట్లాడుతూ.. దేశానికి అత్యంత కీలకమైన వనరులు భూగర్భ జలాలని, వీటిని కాపాడుకొనే బాధ్యత అందరిపై ఉందని అన్నారు. భూగర్భ జలాలను రక్షించడానికి స్థిరమైన పద్ధతులు, విధానాలు.. కల్పించే దిశగా ఇట్లాంటి అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయటం ఎంతో ముదావహం అన్నారు. ప్రపంచ జనాభాలో సగం మందికి తాగునీరు అందించటంలో భూగర్భ జలాలు ఎంతో ఉపకరిస్తున్నాయని వీటిని దుర్వినియోగం చేస్తే భవిష్యత్తు తరాలకు త్రాగునీటి సమస్య ఉత్పన్నం అవుతుంది అని ఆయన హెచ్చరించారు. పొందూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇంఛార్జి ప్రిన్సిపాల్ కె. సూర్యారావు మాట్లాడుతూ.. పంచ భూతాల్లో ఒకటిగా ఉన్న జలాన్ని కాపాడుకోవడం.. నీటిని పొదుపుగా వాడటం మన ముందు ఉన్న తక్షణ కర్తవ్యం అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా భూగర్భ జలాలు తగ్గిపోతూ కాలుష్యానికి గురి అవుతున్నాయని నీటి వినియోగం గణనీయంగా పెరిగిందని దీన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడటం అలవాటు చేసుకోవాలని సూచించారు. భూగర్భ జల సంరక్షణ మన బాధ్యత అని ఆయన గుర్తు చేశారు.. ప్రముఖ నెప్రాలజిస్ట్ డాక్టర్ బెందాళం గౌతమి మాట్లాడుతూ వేగంగా పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా త్రాగునీరు సాగునీరు.. సమృద్ధిగా వుండాలంటే వృధాగా పోతున్న జలాలు ఒడిసిపట్టి నిలువరించే పనులు చేయాలని కోరారు. నీటి నిలువ ప్రాముఖ్యతను తెలియజేస్తూ అందరూ పొదుపుగా నీటిని వాడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో వీటిపై పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని కోరారు. వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ కో ఆర్డినేటర్ శాసపు జోగినాయుడు మాట్లాడుతూ.. దేశంలో నానాటికీ అంతరించిపోతున్న భూగర్భ జలాల పరిరక్షణకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలు పెద్ద ఎత్తున అమలు చేస్తున్నాయని చెప్పారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దేశంలో ప్రతి ఒక్కరికీ స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలనే లక్ష్యంతో జలజీవన్ మిషన్ కార్యక్రమం ప్రవేశ పెట్టారని చెప్పారు. దీంతో పాటు అటల్ బూజల్ యోజన.. ప్రధాన మంత్రి కృషి సంచార్ యోజన వంటి పథకాలు ప్రవేశ పెట్టారని గుర్తు చేశారు. జలశక్తి అభియాన్ పథకం నీటి సంరక్షణకు.. నీటి పొదుపుకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నీటి సంరక్షణ విషయంలో కేంద్ర ప్రభుత్వం కఠిన చట్టాలు తీసుకురావాలని ఆయన సూచించారు. స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు గేదెల ఇందిరా ప్రసాద్ మాట్లాడుతూ... జలం లేనిదే జీవం లేదన్నారు.. మాజీ గవర్నర్ పీజీ గుప్తా మాట్లాడుతూ.. నీటిని పొదుపుగా వాడుకోవాలని తద్వారా జాతీయ సంపదను కాపాడే వారిమి అవుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన చిట్టి సూర్యనారాయణను స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టార్ వాకర్స్ క్లబ్ ప్రతినిధులు గోలీ ఉమా మహేశ్వర రావు, గేదెల లక్ష్మీ, గుడ్ల జగ్గారావు, బొడ్డేపల్లి ప్రసాదరావు, వై.మోహన్, ఎం.మల్లిబాబు, గద్దిబోయిన కృష్ణ, కిల్లారి రామారావు, నాగేశ్వర ఈశ్వరరావు, గోర్లు వాసుదేవరావు, మెట్ట ధనుంజీయ భట్ల, వాసంతి, జ్యోతి, రామ్బాయి, పి.నాగేశ్వరరావు, శేఖర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**నరసన్నపేట, మార్చి 22 (వార్త):** నరసన్నపేట మండల పరిధిలో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏఈ గుప్తా తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. నరసన్నపేట సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహించనున్న మరమ్మతుల కారణంగా మధ్యాహ్నం 4 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని పేర్కొన్నారు. ఈ అంతరాయం నరసన్నపేట పట్టణంతో పాటు కంబకాయ, జమ్ము, తామరపల్లి, సత్యవరం గ్రామాలకు ప్రభావం చూపనుంది. ప్రజలు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి

**నరసన్నపేట, మార్చి 22 (వార్త):** నరసన్నపేట పట్టణంలో పేకాట నిర్వహిస్తున్న శిబిరంపై పోలీసులు దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై గణేష్ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం పట్టణంలోని నెయ్యిల వీధిలో పేకాట జోరుగా సాగుతున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడి చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ దాడిలో భాగంగా ఐదుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వారి వద్ద నుండి రూ.17,850 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## ఏపీ మోడల్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానం

**పోలాకి, మార్చి22 (వార్త):** పోలాకి మండలం ఈదుల వలసలోని ఏపీ మోడల్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. ఈ నెల 18వ తేదీ నుండి ఏప్రిల్ 30 వరకు అభ్య ర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అధి కారిక వెబ్‌సైట్ (http://apms.apcfss.in) ద్వారా దర ఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 10వ తరగతి మెరిట్ ఆధా రంగా ప్రవేశాలు కల్పిస్తామని వివరించారు. ఆసక్తి గల విద్యా ర్థులు మరిన్ని వివరాల కోసం 9949245179 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక

**శ్రీకాకుళం, మార్చి22(వార్త):** ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదిక, రెవెన్యూ క్లినిక్ (భూ సమస్యలపై) జిల్లా పరిషత్ లో సోమవారం నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. అర్జీదారులు వారి యొక్క అర్జీలు నేరుగా లేదా ఆన్లైన్ లో మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్ వెబ్సైట్‌లో నమోద చేసుకోవచ్చన్నారు. అర్జీ దారుల అర్జీల నమోదు, నమోదైన అర్జీల గురించి వాటి యొక్క స్థితి దానికి సంబంధించి సమాచారం గూర్చి తెలుసుకోవాలంటే 1100కి నేరుగా కాల్ చేయవచ్చని వివరించారు.

## రాజరాజేశ్వరి అమ్మవారి

# పండుగల్లో ఎమ్మెల్యే బగ్గు

**పోలాకి, మార్చి 22 (వార్త):** పోలాకి మండలం రేవు అంపలాం గ్రామంలో యోగి బ్రదర్స్ నివాసంలో నిర్వహించిన రాజరాజేశ్వరి అమ్మవారి పండుగల్లో నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పలనాయుడు, పోలాకి పిఎసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి కిల్లి వేణుగోపాలస్వామి, రాష్ట్ర నగరాల కార్పొరేషన్ డైరెక్టర్ నల్లన వెంకునాయుడు, యూనిట్ ఇంచార్జి ఉప్పాడ అప్పలరెడ్డి, తెంబూరు గౌరినాయుడు, లుకలాపు చిన్నబాబు, కొత్త రేవు సర్పంచ్ అర్జాల విష్ణు, మాజీ ఎంపిటిసి సభ్యులు కొనేటి మోహనరావు, నందుపల్లి జోగారావు, పూడి కూర్మారావు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546